## స్కిల్ డెవలప్‌మెంట్‌ను కొనసాగించాలి

ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన వేముల




నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంపై బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఇటీవల శాసనసభలో ప్రస్తావించారు. బాల్కొండ నుంచి 18వేల మంది యువత గల్ఫ్ దేశాల్లో ఉంటారని తెలిపారు. అలాంటి వారికి నైపుణ్య శిక్షణనందిస్తే మంచి వేతనాలు, ఉద్యోగాలు లభిస్తాయన్న ఆశయంతో తాను మంత్రిగా ఉన్నప్పుడు న్యాక్ శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేయించానని గుర్తు చేశారు. శిక్షణ కేంద్ర భవన నిర్మాణం ప్రారంభించుకునే సమయంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సెంటర్‌ను రద్దు చేయడం నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సభలో వివరించారు. శిక్షణ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో మేడారం ప్రసాదం




ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 20: ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా భక్తులకు మేడారం ప్రసాదాన్ని అందజేస్తున్నట్లు ఆర్ఎం జానిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మక్క-సారలమ్మ బంగారం (బెల్లం), కుంకుమను ఇంటికే అందజేస్తామని పేర్కొన్నారు. ప్రసాదం కోసం ఈ నెల 25వ తేదీలోగా రూ. 299 చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు వినోద్ 9550232626(ఆర్మూర్), షాహిద్ 9014296638(బోధన్), మురళి 3154298727 (నిజామాబాద్-1), సాయికుమార్ 7396889 496(నిజామాబాద్-2), ఇర్ఫాన్ 9154298729 (బాన్సువాడ), రాజు 9154298730 (కామారెడ్డి), కాశీరామ్ 8639969647 (ఆర్ఎం కార్యాలయం) నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.



న్యాక్ భవనం కోసం ఎంపిక చేసిన స్థలం

# ‘వృత్తి నైపుణ్యం’పై సర్కారు పైత్యం

## యువత ఆశలపై నీళ్లు

మోర్తాడ్‌లో న్యాక్ సెంటర్ రద్దు

జీవో జారీ చేసిన కాంగ్రెస్ సర్కారు

ఆందోళనలో నిరుద్యోగులు

విద్యార్థి సంఘాల ఆగ్రహం.. ఆందోళన చేస్తామని హెచ్చరిక

రద్దు నిర్ణయం వెనక్కితీసుకోవాలని డిమాండ్

మోర్తాడ్, ఫిబ్రవరి 20: నిరుద్యోగ యువత ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. వారికి ఉపాధి కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన ‘హస్తం’.. వారి భవిష్యత్తును ఆగమాగం చేసింది. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన కార్మికులను అందించడానికి బాల్కొండ నియోజకవర్గంలో గత కేసీఆర్ ప్రభుత్వం న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్) కేంద్రాన్ని మంజూరుచేసింది. ఇందుకోసం రూ.5 కోట్ల నిధులు మంజూరుచేయగా.. మోర్తాడ్ మండల కేంద్రంలో అప్పటి రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి న్యాక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో ఈ ప్రాంత యువతీయువకులు ఎంతో సంతోషించారు. తమ భవిష్యత్తుకు దారి దొరికిందని సంబురపడ్డారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆనందాన్ని ఎక్కువసేపు నిలువకుండా చేసింది.కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన న్యాక్ కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్లు ఇటీవల జీవో విడుదల చేసి నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు గుమ్మరించింది. మంజూరైన న్యాక్ కేంద్రం రద్దు జీవోను వెనక్కి తీసుకోవాలని ఇక్కడి యువత డిమాండ్ చేస్తుంది.

### ఉపాధి కోసం గల్ఫ్ బాట..

బాల్కొండ నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన యువత ఉపాధి కోసం ఎక్కువగా గల్ఫ్‌బాట పడుతున్నది. ఒక్క బాల్కొండ నియోజకవర్గం నుంచే దాదాపు 18వేల మందికిపైగా ఉపాధికోసం గల్ఫ్‌లో ఉంటున్నారంటే ఇక్కడి దయనీయ పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు. గతంలో ఉపాధి కోసం భీవండి, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. కాలక్రమేనా గల్ఫ్ దేశాలకు వెళ్లడం ప్రారంభించారు. ఏండ్ల తరబడి కుటుంబాలకు దూరంగా అక్కడ కూలిపనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. గల్ఫ్ వెళ్లే క్రమంలో చాలమంది యువకులు ఏజెంట్ల చేతిలో మోసపోయి అప్పుల బారినపడ్డ కుటుంబాలు కోకొల్లలు. ఇలాంటి పరిస్థితుల్లో గత కేసీఆర్ ప్రభుత్వం మోర్తాడ్‌కు న్యాక్ కేంద్రం మంజూరు చేయడంతో తమకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని నిరుద్యోగ యువతీయువకులు భావించారు. కానీ న్యాక్‌ను రద్దు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో యువత ఆందోళన చెందుతున్నది.

### రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలి



న్యాక్ కేంద్రం ఏర్పాటును రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. న్యాక్ కేంద్రం మోర్తాడ్‌కు మంజూరుకావడంతో యువకులందరం అదృష్టంగా భావించాం. వివిధ రంగాల్లో సాంకేతికంగా శిక్షణను పొంది రాష్ట్రంతోపాటు విదేశాల్లో సైతం మంచి వేతనాలపై ఉపాధి పొందే అవకాశాలు ఉండేవి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈవిషయాన్ని గుర్తించి న్యాక్ కేంద్రం రద్దును విరమించుకోవాలి.

-సాయిసూర్య, వడ్యాట్

### యువకుల ఆశలపై నీళ్లు చల్లిన సర్కారు



న్యాక్ కేంద్రం ఏర్పాటు రద్దు నిర్ణయం యువకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. న్యాక్ కేంద్రం ఏర్పాటయితే టెక్నికల్‌గా ముందుకు వెళ్లాలనుకునే యువకులు ఉచిత వసతి, భోజనంతోపాటు శిక్షణ, సర్టిఫికెట్లను పొంది వివిధ కంపెనీల్లో ఉపాధి పొందే అవకాశాలు మెరుగపడేవి. అసలు రాష్ట్ర చరిత్రలోనే నియోజకవర్గ స్థాయిలో న్యాక్ కేంద్రం ఏర్పాటు చేయడమనేది ఎంతో సంతోషించదగ్గ విషయం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే న్యాక్ కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడం శోచనీయం.

-బొమ్మెన రుద్రేశ్, వడ్యాట్

**రద్దు జీవోను వెనక్కి తీసుకోవాలి**

మోర్తాడ్‌లో న్యాక్ కేంద్రం ఏర్పాటు రద్దు జీవోను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విద్యార్థిసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యువతీ యువకుల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు న్యాక్ కేంద్రం ఏర్పాటును రద్దు చేస్తే ఉద్యమాలు చేస్తామని ఇప్పటికే యువత హెచ్చరించింది. న్యాక్ కేంద్రం ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాలు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నాయి. న్యాక్ కేంద్రం ఏర్పాటుపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీలో కూడా మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తారని, వృత్తి నైపుణ్యంలో శిక్షణను ఇస్తే మంచి వేతనాలతో ఉద్యోగాలు లభిస్తాయన్న ఉద్దేశంతో మోర్తాడ్‌లో న్యాక్ కేంద్రానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

### రద్దుపై ఆందోళన చేస్తాం..




అప్పటి ఆర్అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి యువకుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మోర్తాడ్‌కు న్యాక్ కేంద్రాన్ని మంజూరు చేయించారు.కలెక్టర్ ఆధ్వర్యంలో స్థలాన్ని కూడా సేకరించి శంకుస్థాపన కూడా చేశారు. నిర్మాణ పనులే తరువాయి అనే పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాక్ కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడం అమానుషం. ఇక్కడి నుంచి గల్ఫ్‌కు వెళ్లే యువతను దృష్టిలో ఉంచుకుని రద్దు నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి. లేదంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తాం.


-రోహిత్, టీఆర్ఎస్వీనాయకుడు

### న్యాక్ కేంద్రంతో లాభాలు

- ఇక్కడి ప్రాంత యువకులు ఎటువంటి నైపుణ్యం లేకుండా ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తుంటారు. దీంతో వారు అక్కడ కూలి పనులను చేసుకోవాల్సిన పరిస్థితి.
- గల్ఫ్‌కు వెళ్లడానికి లక్షల రూపాయలు వెచ్చించి తీరా అక్కడికి వెళ్లాక జీతాలు వేల రూపాయల్లో ఉంటున్నాయి. దీంతో వారు చేసిన అప్పుల తీర్చడానికే సమయాన్ని వృథా చేసుకోవాల్సిన దుస్థితి. చదువొచ్చినా, రాకున్నా నైపుణ్యం ఉంటే ఉపాధి కచ్చితంగా దొరుకుతుంది. ఉపాధి దొరకాలంటే నైపుణ్యం ఉండాలల్సిందే. అంతటి నైపుణ్యాన్ని, ఉపాధిని చూపిస్తున్నది న్యాక్ కేంద్రం.
- న్యాక్ కేంద్రంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో ఎలక్ట్రికల్, కార్పెంటర్, వైండింగ్, మెకానికల్ తదితర రంగాల్లో శిక్షణను ఇస్తారు. శిక్షణ కాలం పూర్తయ్యాక ప్రభుత్వం సర్టిఫికెట్లను ప్రదానం చేస్తుంది. దీని కారణంగా ప్రైవేటు రంగంలో వివిధ కంపెనీల్లో ఇక్కడే ఉపాధి పొందే అవకాశాలు మెరుగయ్యేవి. అంతే కాక గల్ఫ్‌లో ఎక్కువ వేతనాలు పొందే అవకాశాలు ఉండేవి. నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఇంత మంచి అవకాశాన్ని కల్పించాలని కేసీఆర్ ప్రభుత్వం యోచిస్తే, వచ్చిరాగానే న్యాక్ కేంద్రాన్ని రద్దు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



న్యాక్ కేంద్రం కోసం రూ.5కోట్లు మంజూరు చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీ



న్యాక్ కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీ

## రైతు ప్రయోజనాల కోసం పోరాటం

### వరద కాలువకు నీటి విడుదల ఆపాలి: మాజీ మంత్రి వేముల



ఎస్సారెస్పీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, మిడ్ మానేరు డ్యాం (ఎంఎండీ) ఆయకట్టు రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే పోరాటం చేస్తామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వరద కాలువకు కేటాయింపు కన్నా ఎక్కువగా నీరు వదలొద్దని అధికారులను కోరారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు డ్యామ్ వరకు గల ఆయకట్టును కాపాడుకోవాల్సిన అవసరమున్నదన్నారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలో పర్యటించిన ప్రశాంత్‌రెడ్డి.. మార్గమధ్యంలో ఉప్లూర్ వరద కాలువ వద్ద ఆగారు. దిగువకు నీరు వెళ్తుండడాన్ని గమనించిన ఆయన.. అక్కడి నుంచే ఎస్సారెస్పీ ఎస్ఈకి ఫోన్ చేశారు. ప్రాజెక్టులో నీటి స్టోరేజీ ఎంత ఉంది.. ఈ సీజన్‌లో పంటల సాగుకు ఎన్ని టీఎంసీల నీరు అవసరమవుతుందని అడిగి తెలుసుకున్నారు. కేటాయింపు కన్నా ఎక్కువగా నీటిని వరద కాలువకు వదలొద్దని సూచించారు. ప్రభుత్వం ఎక్కువగా నీటిని విడుదల చేయాలని నిర్ణయిస్తే తనకు చెప్పాలని, తాను ప్రభుత్వంతోపాటు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. వరద కాలువపై నాగపూర్ వద్ద నిర్మించిన నాలుగు గేట్లలో ఒక గేటు నుంచి పూర్తిగా, మరో గేటు నుంచి పాక్షికంగా నీరు కిందకు వెళ్తుందని రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మరోమారు ఎస్ఈకి కాల్ చేసిన ప్రశాంత్‌రెడ్డి.. వరద కాలువ ద్వారా నీరు వదలడం లేదని తమను తప్పుదోవ పట్టించొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం ఇవ్వొదని చెప్పారు. గేట్ల వద్ద తేనెతుట్టె ఉందని మూయకుండా నీరు దిగువకు వృథాగా పోనియడం సబబు కాదన్నారు. అవసరమైతే స్థానిక గ్రామాల ప్రజాప్రతినిధుల సహకారంతో తేనెతుట్టెను తొలగించి, వెంటనే నాగపూర్ వద్ద ఉన్న గేట్లను మూసి వేయించాలని సూచించారు.

## ఖాళీలపై రిపోర్టు తయారు చేయండి



ఎల్లారెడ్డిలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

### ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్

ఎల్లారెడ్డి రూరల్/ గాంధారి, ఫిబ్రవరి 20: ప్రభుత్వ దవాఖానలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలతో ఒక రిపోర్టు తయారుచేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్‌తో మాట్లాడుతూ దవాఖానపై ఫిర్యాదులు వస్తున్నాయని, రోగుల పట్ల శ్రద్ధ కనబరచాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

ఎల్లారెడ్డి పట్టణంలోని క్యాంపు కార్యాలయంతోపాటు లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి, తాడ్వాయి మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్ పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఎల్లారెడ్డిలో 94 మంది, లింగంపేటలో 127 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఎల్లారెడ్డి జడ్పీటీసీ ఉషాగౌడ్, లింగంపేట ఎంపీపీ గరీబున్నీసా, జడ్పీటీసీ శ్రీలత , అధికారులు పాల్గొనారు.



### గిరిజనుల అభ్యున్నతికి కృషి

పిట్లం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో మంగళవారం అధికారికంగా నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. గిరిజన తండాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆయన వెంట జడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఆర్డీవో భుజంగ రావు ఉన్నారు.

– పిట్లం, ఫిబ్రవరి 20

## అర్వింద్ అహంకారి..

అందుకే కోరుట్లలో ప్రజలు ఓడగొట్టారు..

డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

కంఠేశ్వర్, ఫిబ్రవరి 20: నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అహంకారం జిల్లా ప్రజలందరికీ తెలుసని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసమర్థుడైన అర్వింద్‌ను ఎంపీగా గెలిపించడం వల్ల ఐదేండ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించడం ఇష్టం లేక ఇటీవల జరిగిన ఎన్నికల్లో కోరుట్ల ప్రజలు చెంప చెల్లుమనేలా ఓడగొట్టారన్నారు. అసమర్థుడు, అహంకారి అయిన అర్వింద్ మళ్లీ ఎంపీ కావడం ఇష్టం లేని బీజేపీ కార్యకర్తలే ఆయనకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తున్నారని, కరపత్రాలు పంచి పెడుతున్నారన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

## కాంగ్రెసోళ్లు దద్దమ్మలు..

పసుపు రైతులను అధోగతి పట్టించింది వాళ్లే

చెరుకు ఫ్యాక్టరీలు బంద్ చేయించిందీ వాళ్లే

నిజామాబాద్ ఎంపీ అర్వింద్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతకాని దద్దమ్మలు. అరవై ఏండ్ల పాలనలో పసుపు రైతులను అధోగతి పట్టించిండ్రు. చెరుకు ఫ్యాక్టరీలు బంద్ చేయించిండ్రు. అలాంటి కాంగ్రెస్ దొంగలను రైతులు నమ్మొద్దని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి మండిపడ్డారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారితో కలిసి నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. హస్తం పార్టీ దిక్కుమాలిన రాజకీయాలతో రైతులు మోసపోతున్నారని తెలిపారు. 34 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీతో చేతకాని పసుపుబోర్డును బీజేపీ తీసుకొచ్చిందన్నారు. చెరుకు ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ఎప్పుడు తెరిపిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.14 వేలు ఉన్న పసుపు ధరను రూ.20 వేలు ఎలా దాటిస్తామో చూడాలని సవాల్ విసిరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ర్యాలీకి అనుమతించిన పోలీసులు.. శివాజీ జయంతి ర్యాలీకి అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

## కేంద్రీయ విద్యాలయ భవనం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

హాజరైన ఎంపీ అర్వింద్,

కలెక్టర్, ఎమ్మెల్యే



కేవీ భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, పాల్గొన్న ఎంపీ అర్వింద్, కలెక్టర్, ఎమ్మెల్యే

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 20: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కేంద్రీయ విద్యాలయాలను పీఎం మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా విస్తరిస్తున్నదన్నారు. నిజామాబాద్‌లో 7.5ఎకరాల విస్తీర్ణంలో రూ.22కోట్లతో నూతన భవనం నిర్మించామని, ప్రస్తుతం ఇక్కడ 10వ తరగతి వరకు అనుమతి ఉండగా, త్వరలోనే 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. బోధన్ పట్టణంలోని కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల ద్వారా నాణ్యమైన విద్య అందుతున్నదన్నారు. పిల్లలను చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా ప్రోత్సహిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు సరైన బాటలు వేయాలని కలెక్టర్ సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల్లో చదువుకున్న వారు దేశభక్తిని పునికిపుచ్చుకుంటారన్నారు. విద్యాలయ ఆవరణలో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అవసరమయ్యే నిధులను తాను సమకూరుస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంస్థల హైదరాబాద్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మమత, విద్యార్థులు, తల్లిదండ్రులు, కేంద్రీయ విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటల కోసం ఐదో విడుత నీటి విడుదలను మంగళవారం ఉదయం ప్రారంభించినట్లు నీటి పారుదల శాఖ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ప్రధాన కాలువ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న లక్షా 25వేల ఎకరాలకు ఇప్పటి వరకు నాలుగు విడుతల్లో 5.91 టీఎంసీల నీటిని విడుదల చేశామని, ప్రస్తుతం ఐదో విడుత విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలలో మార్పులు ఉండొచ్చని అన్నారు. ప్రాజెక్టులో 1405.00 అడుగులు 17.80 టీఎంసీలకు 1398.60అడుగులు 9.91 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని పేర్కొన్నారు.